# నాలుగు రోడ్ల కూడలి



“అమ్మా, సుశీలా! నాక్కొంచెం కాఫీ ఇస్తావూ?” అన్నాడు జగన్నాథం, న్యూస్ పేపర్ చదవటం పూర్తిచేసి, గోడ మీద గడియారం ప్రొద్దున్న ఎనిమిదిన్నర గంటలయిందని చెబుతున్నది. వంటింట్లోనించి సుశీల పెద్దగా అన్నది -- “మీరింట్లో వుండేవాళ్ళేగా, కొంచెం ఆగండి మామయ్యగారూ! ఈ రాక్షసి జడవేయించుకోవటంలేదు”.

“తొందర లేదులే అమ్మా! ప్రొద్దున్నే కాఫీ పడకపోతే అదోలా వుంటుంది మరి. మరచిపోయావేమోనని అడిగాను అంతే!” అన్నాడు జగన్నాథం, కొంచెం నొచ్చుకుంటూ.

ప్రక్కనే మనవడి గదిలోనించి ఇంగ్లీష్ పాటలు, తలుపు మూసివున్నా కూడా బిగ్గరగా వినిపిస్తున్నాయి. జగన్నాథం ప్రక్కనే వున్న చిన్న పోర్టబుల్ రేడియోలోని కర్నాటక సంగీతం మాత్రం వినబడటం లేదు. ఆయన రేడియో ఆపేసి, పడక్కుర్చీలో వెనక్కి ఆనుకుని, కళ్ళు మూసుకున్నాడు.

వంటింట్లోనించి పూరీల వాసనా, కాఫీ వాసనా కలిసి వస్తున్నాయి.

జగన్నాథం మనసులోని ఆలోచనలు ఉవ్వెత్తున పైకిలేస్తున్నాయి. ఈ రోజు ఆయన డెభై రెండవ పుట్టినరోజు. ప్రతి సంవత్సరం, పార్వతి గుర్తుపెట్టుకుని, పుట్టినరోజని తనకిష్టమైన వంటలు చేసి పెట్టేది. కొత్త చొక్కా కుట్టించేది. కానీ పార్వతి పోయిన రెండేళ్ళనించీ, తన పుట్టినరోజు, కొడుక్కిగాని కోడలుకి గాని గుర్తు రావటం లేదు. పుట్టినరోజు సంగతేమోగాని, కనీసం రోజూ

ప్రొద్దున్నే కాస్త కాఫీ యివ్వటం కూడా గుర్తురాదు కోడలికి.

అప్పుడే స్నానం చేసి, ఆఫీసుకి వెళ్ళటానికి బట్టలు వేసుకుని, పూరీలు తింటూ అంటున్నాడు సురేష్, సుశీలతో - "ఏమిటి నాన్న మళ్ళీ నిద్రపోతున్నట్టున్నాడు, పడక్కుర్చీలో పడుకుని" అన్నాడు.

సుశీల అంటున్నది "అవును. మరింక చేసేదేముంది? రాత్రీ పగలూ అంతా విశ్రాంతే కదా. కాఫీ కావాలని, నా దుంపతెంచారు. తెచ్చేలోగా నిద్రలోకి జారుకున్నారు".

జగన్నాథానికా మాటలన్నీ వినపడుతూనే వున్నాయి. ఉదయం ఆరు గంటలకే లేచి, ఆరున్నరకల్లా కాఫీ తాగటం ఆయనకు యాభై ఏళ్ళ నించీ అలవాటు. సమయం ఎనిమిదిన్నర దాటినా, తనకు యింకా కాఫీ రాలేదు. అది ఈ రోజున కొత్తేమీ కాదు. గత రెండేళ్ళుగా, అంటే పార్వతి చనిపోయిన రోజునించీ, ఎక్కడో ఏదో లోపం. ఇలా ఎందుకు జరుగుతున్నది?

బీద కుటుంబంలో పుట్టిన జగన్నాథం, జీవితంలో చాలా కష్టాలు పడ్డాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోవటంతో, తల్లి వంటలు చేసి అతన్ని డిగ్రీ దాకా చదివించింది. బ్యాంక్‌లో ఉద్యోగంలో చేరిన జగన్నాథం, ఆవిడ్ని సుఖపెడదామని ఉత్సాహపడే సమయానికి, ఆవిడ తనువు చాలించింది. కొంతమందికి జీవితంలో సుఖపడే అవకాశం, అదృష్టం వుండవేమో మరి!

ఉద్యోగంలోనూ బయటా చాలా నిజాయితీపరుడనీ, సహృదయుడనీ మంచిపేరు తెచ్చుకున్నాడు జగన్నాథం.

అందరికీ తలలో నాలుకలా వుంటూ, కష్టాల్లో వున్నవారికి, యథాశక్తి సహాయం చేస్తూ, తను నమ్మిన మానవసేవలోనే, తన మాధవుడ్ని చూసుకునేవాడు జగన్నాథం.

తర్వాత పార్వతితో వివాహం. పార్వతి కూడా జగన్నాథానికి ఏనాడూ అడ్డుచెప్పలేదు. జగన్నాథం, బీద విద్యార్థులకు ధనసహాయం చేస్తున్నా, శనివారాలు పేదలకు అన్నదానాలు చేస్తున్నా, అతన్ని పూర్తిగా సమర్థించింది. వారి ప్రేమానురాగాల ఫలితం సురేష్. సురేష్ కూడా చక్కగా చదువుకుని, ఆ ఊళ్ళోనే ఒక కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సురేష్‌కు పెళ్ళి కూడా, అతనికి నచ్చిన అమ్మాయితో ఘనంగా జరిపించాడు. ఇంజనీరింగ్ చదివిన తన కొడుక్కి, కానీ కట్నం తీసుకోకుండా, పెళ్ళి ఖర్చు తనే భరించి, సుశీలను కోడలుగా చేసుకున్నాడు. అంతే కాక, కొడుకునీ కోడల్నీ తనతో పాటే తన స్వంత ఇంట్లో వుండమన్నాడు కూడాను.

"నాన్నా! కాఫీ తాగకుండా పడుకున్నావేం? లే!" అంటున్నాడు సురేష్. కళ్ళు తెరిచాడు జగన్నాథం. సురేష్ బయట స్కూటర్ స్టార్ట్ చేస్తున్నాడప్పుడే. వంటింట్లో ఇంకా చప్పుళ్ళు

వినపడుతూనే వున్నాయి.

మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు జగన్నాథం.

పార్వతి తనను పసిపాపలా చూసుకున్నది. తన ఆశలూ, ఆశయాలూ, నమ్మకాలు, విలువలను గౌరవించటమే కాక, మనసా, వాచా, కర్మణా, తన ప్రక్కనే నిలబడింది. తన జీవితానికొక అర్థం చూపించింది. అలాంటి పార్వతి, ఇహలోకంలో తన కార్యక్రమం పూర్తిచేసుకుని, పరలోకానికి వెళ్ళిపోయింది. చనిపోయేముందు, ఆమె చూసిన చూపులోని ఆ అర్థం ఒక్క జగన్నాథానికే తెలుసు. పార్వతి నోరు విప్పి, "నాన్నని జాగ్రత్తగా చూసుకో నాయనా" అని సురేష్‌తో చెప్పిన మాటలే సురేష్‌కి అర్థం కాలేదు. అయినా తనని మాత్రం, పార్వతి చూపు, యింకా తట్టి లేపుతూనే వుంటుంది.

'నాకు పిలుపు రాగానే.... వస్తాను... పార్వతీ..... మళ్ళీ నీ కళ్ళల్లోకి చూడాలని వుంది' - పైకి వినపడకుండా అనుకుంటూ వుంటాడు జగన్నాథం.

ప్రొద్దుటినించీ కాఫీ, ఫలహారాలు ఏమీ పడకపోవటం వల్ల, కడుపులో కరకరమంటున్నది జగన్నాథానికి, పడక్కుర్చీలోనించి లేచి, లోపలకు తొంగిచూశాడు.

సుశీల స్నానానికి వెళ్ళినట్టుంది. బాత్రూములోనించి ఆమె పాడే పాట వినిపిస్తోంది.

వంటింట్లోకి వెళ్ళి చూశాడాయన, తన కోసం కాఫీ కలిపి పెట్టిందేమోనని. అక్కడేమీ కనపడలేదు. మనువడి గదిలో నించి, ఇంకా ఇంగ్లీష్ పాటలు వినిపిస్తూనే వున్నాయి. వాడివాళ స్కూలుకి వెడుతున్నట్టు లేదు మరి. మనవరాలు స్కూలుకి తయారవుతున్నట్టుంది, యూనిఫారం మీద దుమ్ముని దులుపుతున్నది.

"రాజీ! నేను బయటకు వెడుతున్నాను. అమ్మకి చెప్పు తలుపు వేసుకో!" అని, ఇంట్లోనించి బయట పడ్డాడు.

తను నలభై ఏళ్ళుగా చూస్తున్న రోడ్డది. ముప్ఫయి వేల మంది జనాభా కోసం వేసిన రోడ్డు. ఈ రోజు మూడు లక్షల మందిని చూస్తున్నది. అయినా ఆ రోడ్డు సైజులో కానీ, గుంటల్లో కానీ, ఆనాటికీ ఈనాటికీ పెద్ద తేడా ఏమీలేదు.

మెయిన్ రోడ్డు మీద వున్న కాఫీ హోటల్లోకి నడిచాడు జగన్నాథం. చిన్న కాకా హోటల్‌లాగా వుండే ఆ ఉడిపి శ్రీ కృష్ణ భవన్, ఈనాడు హోటల్ సౌందర్య ఎ.సి. అయింది. తనూ, పార్వతీ పది రూపాయల ఖర్చుతో, ఉప్మా పెసరట్టు, కాఫీ తీసుకునేవాళ్ళు. ఈరోజు ఒక్క పెసరట్టే పదిహేను రూపాయలయింది. అవునుమరి, ఆ రోజుల్లో బ్యాంక్ మేనేజర్‌కి వెయ్యి రూపాయల జీతం,

ఈనాడు అదే బ్యాంక్‌లో ఫ్యాన్‌కి అంతకన్నా ఎక్కువ వస్తుంది.

వేడి వేడి ఇడ్లెన్లు తిని, కాఫీ తాగుతున్నాడు జగన్నాథం. ఆ రోజుల్లో కాఫీ హోటలుకి వెడితే, కౌంటర్ దగ్గర నించి, సర్వర్ల దాకా పలకరింపులు. అక్కడికి వచ్చే పోయే వాళ్ళు కూడా సగంమంది, జగన్నాథాన్ని ఆప్యాయంగా పలకరించేవాళ్ళు. ఇప్పుడు ఎవరి సంగతీ ఎవరికీ పట్టదు. అంతా హడావిడి. అంతేకాదు ఆనాడు 'మనసున మల్లెల మాలలూగెనే' పాట వినిపించిన వాళ్ళు, ఈనాడు 'నీ సిగ్గు ఎగ్గులెంత వరకూ.... నీ చీర జారు వరకూ.....' అన్న పాటను సిగ్గూ, ఎగ్గూ లేకుండా వినిపిస్తున్నారు.

"ఏంవోయ్ జగన్నాథం! ఏమిటీ ఆలోచిస్తున్నావు"? పలకరించాడు అనంతరావు, అప్పుడే వస్తూ.

అతన్ని చూస్తే ప్రాణం లేచి వచ్చినట్టయింది జగన్నాథానికి.

"ఏం లేదు. రోజులు ఎంత మారిపోయాయా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు జగన్నాథం.

పెద్దగా నవ్వాడు అనంతరావు. "నేను కూడా నీలాగానే డెబ్భయ్ ఏళ్ళుగా చూస్తున్నాను. అయినా రోజులేమీ మారటం లేదే. అప్పుడూ, ఇప్పుడూ రోజుకి ఇరవై నాలుగు గంటలే. గంటకి అరవై నిమిషాలే!" అన్నాడు.

జగన్నాథం కూడా నవ్వాడు.

"వయస్సు మీదపడ్డ నీ హాస్యధోరణి మాత్రం మారలేదు అంతూ!" అన్నాడు.

అనంతరావు అన్నాడు -

"మారుతున్నవి రోజులు కాదు జగన్నాథం. మనుషులు, వాళ్ళ విలువలు".

"మంచికా, చెడుకా ఈ మార్పు?"

మళ్ళీ నవ్వాడు అనంతు - "మంచీ చెడూ అన్నవి ఆ రోజూ వున్నాయి. ఈ రోజూ వున్నాయి. మార్పు అన్నది సహజం. కాలానుగుణంగా ఆ మార్పు అలా వస్తూనే వుంటుంది. అది ఆపటం నీ తరం కాదు, నా తరం కాదు. అంతేకాదు, ఆ మార్పుని రాకుండా చూడటం అన్యాయం, అసహజం. అసమంజసం. కాకపోతే మంచి మార్పు మంచిది. చెడ్డ మార్పు చెడ్డది".

"మాటలతో గారడీ చేయటం మాత్రం నువ్వు మానవు" అన్నాడు జగన్నాథం.

"గారడీ కాదు జగన్నాథం! నూటికి నూరుపాళ్ళూ నిజం. నీకో సంఘటన చెబుతాను విను" అని సర్వర్‌ని పిలిచి, తనకో కాఫీ ఆర్డర్ చేశాడు అనంతరావు.

"నువ్వింకో కాఫీ తాగుతావా?" అని అడిగాడు జగన్నాథాన్ని.

"లేదు నాకు పొద్దున్న ఒకేఒక్క కాఫీ తాగటం అలవాటు" అన్నాడు జగన్నాథం.

"నాలాంటి సన్నిహితుడూ, శ్రేయోభిలాషీ కాఫీ యిప్పిస్తుంటే, ఆ అలవాటుని మార్చుకోవచ్చు కదా జగన్నాథం!" అన్నాడు అనంతరావు నవ్వుతూ.

"వద్దులే! నువ్వు తాగు. నేను కంపెనీ యిస్తాను" అన్నాడు జగన్నాథం.

మళ్ళీ నవ్వాడు అనంతరావు.

"సరే! ఇవాళ కూడా గంటకి అరవై నిమిషాలేనన్న మాట.... ఒకే.... చెబుతున్నాను"

"ఏదో...... సంఘటన..... చెబుతానన్నావ్...."

"నీకు గుర్తుందా! 1947లో.... ఫిబ్రవరి నెలలో అనుకుంటాను.... మనం ఎలా గడిపిందీ" అన్నాడు అనంతరావ్ సాలోచనగా.

"మరీ లాంగ్ ఫ్లాష్‌బాక్ పెట్టావు అనంతూ. అయినా అదెందుకు గుర్తుండదు? మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి కొన్ని నెలల ముందు".

"అవును.... దేశంలో కల్లోలం ఎక్కువయిపోయింది. మనందరం చేయవలసిందంతా చేశాం. చాలామంది త్యాగధనులు ప్రాణాలు కోల్పోయారు. అయినా దేశానికి స్వాతంత్ర్యం వచ్చే అవకాశం కనిపించలేదు. గాంధీగారు బ్రిటీష్ వాళ్ళని గడగడలాడిస్తున్నారు....."

పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ అన్నాడు జగన్నాథం. "అవును.... నాకప్పుడు ఇరవై ఒకటో ఏడు. నేనూ ఆ ఉద్యమంలో, పోలీసుల చేతుల్లో లాఠీ దెబ్బలు తిన్నాను".

"ఒకసారి కాదు.... చాలాసార్లు.... ఇద్దరం కలిసి వారం రోజులు జైల్లో కూర్చున్నాం కూడాను" అనంతు.

"కానీ స్వాతంత్రం వచ్చిన రోజు గుర్తుందా? ఇద్దరం కలిసి రోడ్డు మీద సంతోషంతో గంతులు వేశాం" అన్నాడు జగన్నాథం, ఆనాటి ఉత్సాహం ఈనాడు కళ్ళల్లో మెరుస్తుండగా.

"అవును.... అదే నేను చెప్పబోతున్న సంఘటన. ఇవాళ కూడా..... అలాగే రోడ్డు మీద సంతోషంతో గంతులు వేద్దామనుకున్నాను, కానీ డెబ్భయ్ ఏళ్ళ శరీరం ఎగరటానికి ఒప్పుకోలేదు".

జగన్నాథానికి అర్థం కాలేదు.

"అంత సంతోషం కలిగించిన విషయం ఏమిటోయ్" అన్నాడు.

“ఆ రోజున మనకీ, మన దేశానికీ బానిసత్వం పోయి, స్వతంత్రం వచ్చినందుకు ఎగిరి గంతులు వేశాం. ఈ రోజు ఈ స్వాతంత్రం నాకు వచ్చింది. అందుకే ఈ సంతోషం” అన్నాడు అనంతరావు.

ఈలోగా సర్వర్ కాఫీ తెచ్చి, బల్ల మీద పెట్టాడు.

కాఫీ కొంచెం చప్పరించి, అన్నాడు అనంతరావు.

“నీకు తెలుసు. మా ఆవిడ పోయిన దగ్గరనుంచీ, నేను మా అమ్మాయి దగ్గరే వుంటున్నానని. మా అమ్మాయి, అల్లుడు ఇద్దరూ పెద్ద ఉద్యోగాల్లో వుండటం వల్ల, వాళ్ళ పిల్లల్ని చూసుకోటానికి, నన్ను తన దగ్గర వుంచుకుంది మా అమ్మాయి. నేను, ప్రేమగా తన దగ్గర వుంచుకున్నదనీ, పిల్లలకి తోడుగా వుండటం అవసరం అనీ అనుకున్నానే కానీ, నన్ను అలా వాడుకుంటున్నదని ఏనాడూ అనుకోలేదు. ఒక దశాబ్దం పైన అక్కడే వున్నాను. మధ్య మధ్య వంటమనిషి రానప్పుడు వంటవాడిగా, పనిమనిషి రానప్పుడు పనివాడిగా కూడా అవతారాలెత్తాను. నా కూతురి సుఖం కోసం నేను ఖర్చు పెట్టిన డబ్బులే కాకుండా, నా చరమాంకం కోసం నేను దాచుకున్న డబ్బులను కూడా, గీత వాడటం ప్రారంభించింది. అంతేకాక, తన కొడుకు ప్రేమించిన అమ్మాయిని కాదని వాడ్ని పెళ్ళికొడుకుల సంతలో పెట్టి, బేరం చేస్తున్నది. నా మనవడు రమణ నా దగ్గరకు వచ్చి, తను మనసిచ్చిన ఆ పిల్లనే పెళ్ళి చేసుకుంటాననీ, వాళ్ళు గీత అడుగుతున్నంత కట్నం ఇచ్చేంత పరిస్థితిలో లేరనీ గోల పెట్టాడు. నేను గీతని పెద్ద చదువులు చదివించటానికీ, చాలా కట్నం యిచ్చి ఘనంగా పెళ్ళి చేయడానికి ఎంత కష్టపడ్డానో దానికీ తెలుసు. ఆనాటి నా గుండెల మీద కుంపటి, ఈనాడు ఒక మగ మహారాజుకి తల్లయి, కట్నాల బజారులో వేలం పాటకు సిద్ధమయింది. నేను జన్మనిచ్చిన నా కూతురికి నా భావాలూ, విలువలూ అర్థం కాకపోవటం నా దురదృష్టం” ఆగాడు అనంతరావు.

ప్రక్కనే వున్న సర్వర్‌ని పిలిచి, “నాకింకో కాఫీ తీసుకురా!” అన్నాడు జగన్నాథం.

అతన్ని ఆశ్చర్యంగా చూశాడు అనంతరావు.

అనంతరావు చేతిని తన చేతిలోకి తీసుకొని, మృదువుగా వత్తుతూ “చెప్పు” అన్నాడు జగన్నాథం.

“చెప్పేందుకు ఇంకేమీ లేదు. రమణతో వాడు ప్రేమించిన అమ్మాయితోనే పెళ్ళి జరిపిస్తానన్నాను. అది విని, నన్ను ఆ ఇంట్లో వుండటానికి వీల్లేదన్నది గీత. సరేనన్నాను. వేరే ఇల్లు అద్దెకు తీసుకుని, స్వతంత్రంగా మళ్ళీ నా కాళ్ళ మీద నేను నిలబడతాను. నేను దాచుకున్న

డబ్బులు చాలు నాకు, మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా గడుపుకోటానికి. రమణ కొన్నాళ్ళు, వాళ్ళావిడితో కలిసి నా దగ్గరే వుంటాడు. తర్వాత వాడి జీవితం, వాడిష్టం!'' అన్నాడు అనంతరావు. ఆ మాటలు అంటున్నప్పుడు, అతనిలో ఎక్కడలేని పట్టుదల, సంతోషం, స్వతంత్రం కనిపిస్తున్నాయి.

సర్వర్ తెచ్చిన కాఫీని, సగం అనంతరావు గ్లాసులో పోసి, మిగతాది తను త్రాగాడు జగన్నాథం.

“నీకు తెలుసా, ఇవాళ నా డెబ్భయి రెండవ పుట్టినరోజు!'' అన్నాడు జగన్నాథం.

“ఓ నిజంగానా, పుట్టినరోజు శుభాకాంక్షలు. ఇంకో ముప్ఫయ్ ఏళ్ళు సుఖంగా బతుకు' అన్నాడు అనంతరావు అతనితో కరచాలనం చేస్తూ.

“పార్వతి వుంటే నన్ను కావలించుకుని ముద్దు పెట్టుకునేది'' అన్నాడు జగన్నాథం, సాలోచనగా, అసంకల్పితంగా.

అనంతరావు పెద్దగా నవ్వాడు.

“నేనంతపని చేయలేను కానీ, కావాలంటే ఈ హోటలు బిల్లు కట్టేస్తాను'' అంటూ లేచాడు.

అతని వెనకే నడిచాడు జగన్నాథం.

ఇద్దరూ హోటల్లో నించి బయటకు రాగానే, అక్కడ కలిశాడు రామకృష్ణయ్య. అతనూ జగన్నాథం వయసువాడే.

“ఏమిటి? మీ ఇద్దరూ ఇక్కడున్నారు. ఈ సమయంలో.....'' అన్నాడు.

“ఏంలేదు రామకృష్ణయ్యా! ఒకళ్ళ కష్టాలు ఇంకొకళ్ళకి చెప్పుకుంటున్నామంతే!''

ముగ్గురూ కలిసి, రోడ్డుకి ప్రక్కగా నడుస్తున్నారు.

“ఈ వయసులో కష్టాలెందుకు? నాలాగా ఏదో రామా కృష్ణా అనుకుంటూ శేష జీవితాన్ని గడిపేయక!'' అన్నాడు రామకృష్ణయ్య.

“రామ కృష్ణా అనుకుంటూ గడపటానికి, మా జీవితాలేమీ రామకృష్ణయ్య జీవితంలా, మూడు పువ్వులూ ఆరు కాయాలూ లాగా లేవే!'' అన్నాడు అనంతరావు నవ్వుతూ, తన సహజ ధోరణిలో.

“నా జీవితం మీరు అనుకుంటున్నంత సుఖవంతంగా ఏమీలేదు. కాక పోతే, మారుతున్న మనుష్యుల తత్వాలకు, పరిస్థితులకు తట్టుకోలేక, తల వంచి, శేషజీవితాన్ని అలా గడిపేస్తున్నా

నంతే....."

"అదేమిటి? నువ్వు ఏ చింతా లేకుండా వున్నావనుకుంటున్నాను నేను" అన్నాడు జగన్నాథం.

ఎదురుగా వస్తున్న స్కూటర్‌కి దారి ఇస్తూ, "నేను పోయాకే.... నా చింతలన్నీ తీరేది!" అన్నాడు రామకృష్ణయ్య, అదోలా నవ్వుతూ.

"మనం బాగా చదువుకున్నాం. దేశ స్వాతంత్ర సంపాదనలో భాగం పంచుకున్నాం. మంచి ఉద్యోగాలు చేశాం. సంసార భారాన్ని విజయవంతంగా నిర్వహించి, పిల్లల్ని పైకి తీసికొచ్చి వాళ్లకు సుఖపడే అవకాశాల్నిచ్చాం. అన్నిటికన్నా ముఖ్యంగా, మనిషిగా పుట్టినందుకు, మనిషిగా బ్రతికి, మానవత్వానికి విలువనిచ్చి బ్రతికాం. కానీ, మనం ఈ రోజు, ఎవరికీ ఉపయోగం లేకుండా వృథాగా మిగిలిపోతున్నాం. మన బ్రతుకులు, మనకు కావలసిన వాళ్ళకే కాక, మనకి కూడా బరువుగా తయారవుతున్నాయి. ఎందుకిలా జరుగుతున్నది?" అన్నాడు జగన్నాథం.

"వయసు, జగన్నాథం, వయసు. నవనవలాడే యాపిల్ పండుని తింటాం కానీ, అది కుళ్ళిపోతే పారేయమూ. అది నవనవలాడినప్పుడు ఎంత ఎర్రగా వుందో ఊహించుకుంటూ, ఆ కుళ్ళిపోయిన పండుని తినలేంకదా!" అన్నాడు రామకృష్ణయ్య.

"దానికి నేను అంగీకరించను. ఆగిపోయిన గడియారం కూడా, రోజుకి రెండుసార్లు సరైన సమయం చూపిస్తుంది. సృష్టిలో ఏదీ, ఎన్నడూ వృథా కాదు. మనల్ని, ఈ భూలోకానికి పంపించిన వాడు. మళ్ళీ వెనక్కి పిలిచేదాకా, మన పని ఇంకా పూర్తికాలేదన్నమాట. కనుక మన కర్తవ్యం, మనం పూర్తిచేయాలి. అందుకే, నేను మళ్ళీ కొత్త జీవితం ప్రారంభిస్తున్నాను" అన్నాడు అనంతరావు.

ఈలోగా మిత్రులు ముగ్గురూ నడుస్తూ, నాలుగు రోడ్ల కూడలి దగ్గరకు వచ్చారు.

రామకృష్ణయ్య, అనంతరావు చెప్పినదానికి ఏమీ సమాధానం కానీ, కనీసం తన అభిప్రాయం కానీ చెప్పకుండా, ఎడమ ప్రక్కకు తిరిగి, నెమ్మదిగా తన ఇంటికి వెళ్ళిపోయాడు.

"రామకృష్ణయ్య జీవితంతో రాజీపడి, జీవచ్ఛవంలా బతుకుతున్న మనిషి" అన్నాడు అనంతరావు, నిట్టూరుస్తూ.

"అని ఎందుకు అనుకోవాలి? సుడిగుండంలో చిక్కుకుని, ఆ మునకలోనే సుఖం చూడటానికి ప్రయత్నం చేస్తున్నాడేమో!" అన్నాడు జగన్నాథం.

నవ్వాడు అనంతరావు.

"అలా అనుకున్న దేవదాసు జీవితం ఏమయిందో చూశావు కదా!" అన్నాడు.

జగన్నాథం ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఇక నేను వెడతాను. చేయవలసిన పనులు, చాలా వున్నాయి" అంటూ, కుడివేపు రోడ్డు మీదకు తిరిగి, గబగబా వెళ్ళిపోయాడు అనంతరావు.

జగన్నాథం, ఒక్కసారి వెనక్కి తిరిగి చూశేడు.

తను ఇంతవరకు ప్రయాణం చేసి వచ్చిన రోడ్డు. తన జీవితంలో, ఎన్నో సుఖాలను అనుభవించి, కష్టాలను ఎదుర్కొని ప్రయాణం చేసి ఇంత దూరం వచ్చాడు.

అది నాలుగు రోడ్ల కూడలి.

అక్కడ, జీవితంతో రాజీపడిన రామకృష్ణయ్య, ఎడమ వేపుకు తిరిగి, రామా కృష్ణా అనుకుంటూ తన నిశ్శబ్ద జీవితం గడపటానికి వెళ్ళిపోయాడు.

అనంతరావు, తన శేష జీవితంలో మిగిలిపోయిన మంచి పనులు పూర్తిచేయటానికీ, సంతోషంగా, స్వేచ్ఛగా బతకటానికీ, దీక్షపూని, కుడి వేపు రోడ్డు మీదకు తిరిగి, వెళ్ళిపోయాడు.

ఎదురుగా వున్న రోడ్డు వేపు చూశాడు జగన్నాథం.

ఆ రోడ్డు కొంచెం ముందుకు వెళ్ళి ఆగిపోతుంది. దాని తర్వాత, ముళ్ళూ, పొదలూ తప్ప ఏమీలేవు. అవి దాటుకుంటూ వెడితే, అక్కడ స్మశానం వుంది. కనుక, తను ఇప్పుడు ముందుకు వెళ్ళటానికి ఆ రోడ్డు పనికిరాదు.

తన ఇంటి దగ్గర రోజూ జరుగుతున్న భాగోతం, ఒక్కసారి మళ్ళీ గుర్తుకు వచ్చింది జగన్నాథానికి.

ఆ నాలుగు రోడ్ల కూడలిలో నిటారుగా నుంచొని, ఒక్క క్షణం ఆలోచించాడు జగన్నాథం. తను ఎటు వెళ్ళాలా అని.

అతని మనస్సు ఒక నిశ్చితమైన అభిప్రాయానికి రాగానే, తనలో తను నవ్వుకుని, రెట్టించిన ఉత్సాహంతో, కుడివేపు రోడ్డు మీదకు తిరిగి, చకా చకా నడిచాడు జగన్నాథం. ●

*(ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక : ఆగస్టు 28, 1998)*